జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435



PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 121 | బుధవారం 24 సెప్టెంబరు - 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.


## మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి

కుంభమేళాకు వేల కోట్లు ఇస్తున్న కేంద్రం.. ఆదివాసీ జాతరకు ఎందుకు ఇవ్వడంలేదు?
గద్దెల పునఃనిర్మాణం.. ఓ భావోద్వేగం
పోరాటానికి, స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ
తల్లుల ఆశీర్వాదంతోనే ప్రజాప్రభుత్వం
ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం
మహాజాతరకు మళ్లీ వస్తా: సీఎం రేవంత్



వరంగల్/ములుగు/తాడ్వాయి, సెప్టెంబరు 23 (సందేశం టైమ్స్) : మేడారం మహాజాతరను కేంద్ర ప్రభుత్వం జాతీయ పండుగగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కుంభమేళాకు కేటాయిస్తున్నట్లుగానే రూ.వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ములుగు జిల్లా మేడారం మహాజాతరలో సమ్మక్క, సారలమ్మ గద్దెలు, ప్రాంగణం పునఃనిర్మాణ పనులను సీఎం ప్రారంభించారు. పునఃనిర్మాణ మాస్టర్‌ప్లాన్‌పై ఆదివాసీలు, గిరిజనులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో, అనంతరం మేడారంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. "కుంభమేళాకు వేల వేల కోట్లు ఇస్తున్నారు. కానీ, మా ఆదివాసీ కుంభమేళాకు ఒక్క రూపాయి ఇవ్వడానికిగానీ, జాతీయ పండుగగా గుర్తించడానికిగానీ కేంద్రానికి ఎందుకో మనసు రావడం లేదు. కుంభమేళా, ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య మాత్రమే కాదు.. తెలంగాణ ప్రాంతంలో ములుగు అడవుల్లో ఉన్న సమ్మక్క, సారలమ్మ కూడా ఓ గొప్ప దేవాలయం. పోరాట పటిమకు, పౌరుషానికి మారుపేరు. రాచరికంపై తిరుగుబాటు చేసి.. జెండా ఎగురవేసిన సమ్మక్క, సారలమ్మ జాతరకు జాతీయ పండుగ గుర్తింపు రావాలి. వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నుంచి గెలిచిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. ఈ విషయంపై దృష్టి పెట్టాలన్నారు. పోరాటానికి, పౌరుషానికి సమ్మక్క, సారలమ్మలు స్ఫూర్తిగా నిలుస్తారని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి తల్లులను

మిగతా 2లో...

## కృష్ణా జలాల్లో 70 శాతం వాటా ఇవ్వాల్సిందే!

నదీ జలాల్లో తెలంగాణ హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం
పక్క రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. చుక్క నీటిని వదులుకోం
ఆల్మట్టి ఎత్తు పెంపు సరికాదు.. సుప్రీంలో గట్టి వాదనలు వినిపిస్తాం
మీడియాతో మంత్రి ఉత్తమ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 23(సందేశం టైమ్స్) : కృష్ణా జలాల్లో తెలంగాణకు 70 శాతం వాటా దక్కాల్సిందేనని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కృష్ణా-గోదావరి జలాల్లో హక్కులపై పోరాటంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మంగళవారం ఢిల్లీలో కృష్ణా ట్రైబ్యునల్ విచారణలో భాగంగా తెలంగాణ తరఫున వాదనలు వినిపించారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. విచారణ తుది దశకు చేరుకుందని, ఫిబ్రవరి నుంచి తెలంగాణ వాదనలు వినిపిస్తోందని చెప్పారు. సెక్షన్-3 రిఫరెన్స్ కింద విచారణ జరుగుతోందని, తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.వైద్యనాథన్ వాదనలు వినిపిస్తున్నారని తెలిపారు. వరసగా మంగళ, బుధ, గురువారాల్లో వాదనలు వినిపిచేందుకు ట్రైబ్యునల్ అవకాశం కల్పించిందని చెప్పారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు న్యాయమైన వాటా రావాలని కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ-2) ముందు తెలంగాణ బలమైన వాదనలు వినిపిస్తోందన్నారు.

మిగతా 2లో...

## సీఎం తులాభారం..

## 68 కిలోల బంగారం సమర్పణ



(సందేశం టైమ్స్): మేడారంలో సీఎం రేవంత్‌రెడ్డి సుమారు రెండున్నర గంటలు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు రావాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలించక పోవటంతో 25 నిమిషాల ఆలస్యంగా వచ్చారు. మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి మేడారం చేరుకున్న ముఖ్యమంత్రి.. ముందుగా మేడారం జాతర ప్రాంతాన్ని హెలికాప్టర్ నుంచి ఏరియల్ సర్వే ద్వారా వీక్షించారు. అక్కడి నుంచి నేరుగా సమ్మక్క-సారలమ్మ ఆలయానికి చేరుకొని తులాభారం వేశారు. రేవంత్‌రెడ్డి 68 కిలోల బంగారాన్ని (బెల్లం) సమర్పించారు. సీఎంకు ఆదివాసీ కళా నృత్యాలతో దేవస్థానం ప్రధాన ముఖద్వారం నుంచి పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క-సారలమ్మ గద్దెలకు చేరుకొని తల్లులను రేవంత్ దర్శించుకున్నారు. గద్దెలతో పాటు ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆదివాసీలు, గిరిజనులు, పూజారులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. మధ్యాహ్నం 2:45 గంటలకు హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల ఉన్నత విద్యకు అజీమ్ ప్రేమ్‌జీ స్కాలర్‌షిప్



హైదరాబాద్, సెప్టెంబరు 23(సందేశం టైమ్స్) : ఉన్నత విద్యలో బాలికలను ప్రోత్సహించడానికి అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ప్రత్యేక స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రకటించింది. దీనికి సంబంధించిన గోడపత్రికను తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్ మంగళవారం తమ కార్యాలయంలో విడుదల చేశారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా పాఠశాల, జూనియర్ కాలేజీల్లోనే చదివి ఉండాలి. ఈ కార్యక్రమం ద్వారా 15వేల మంది బాలికలకు డిగ్రీ పూర్తయ్యేంతవరకు ఏడాదికి రూ.30వేల స్కాలర్‌షిప్ ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని బాలకిష్టారెడ్డి కోరారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ డాట్ ఆర్గ్ వెబ్‌సైట్ ద్వారా స్వీకరిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

## ఇన్ని రోజులూ పేదల రక్తం తాగారు



హైదరాబాద్, సెప్టెంబరు 23 (సందేశం టైమ్స్) : "జీఎస్టీ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గడిచిన 8 ఏళ్లుగా ప్రజల్ని దోచుకుంది. ఇన్ని రోజులూ పేదల రక్తం తాగి.. తాజాగా జీఎస్టీ తగ్గింపుతో పేదలకు లబ్ధి చేసినట్లుగా బీజేపీ నేతలు గొప్పలు చెబుతున్నారు.

మిగతా 2లో...

## రేషన్ డీలర్లతో చెలగాటం వద్దు



బకాయి చెల్లింపుతోపాటు కమిషన్ పెంచాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 23 (సందేశం టైమ్స్) : నెలల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్ల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో

మిగతా 2లో...

## రాష్ట్రంలోకి
## 3,745 కోట్ల పెట్టుబడులు

మూడు కంపెనీలకు ఆమోదం
1,518 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు
పండ్ల సాగు రైతులకు ప్రోత్సాహం : డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 23(సందేశం టైమ్స్) : రాష్ట్రంలో మరో మూడు భారీ కంపెనీలు రూ.3,745 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వీటి ద్వారా 1,518 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయని వివరించారు. ఈమేరకు ఆ మూడు కంపెనీల పెట్టుబడులకు క్యాబినెట్ సబ్‌కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. పరిశ్రమల ప్రోత్సాహక క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం మంగళవారం సచివాలయంలో జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహేశ్వరంలో కొత్త యూనిట్‌ను ఏర్పాటు చేయనున్న జేఎసడబ్ల్యూ యూఏవీ లిమిటెడ్‌కు, గ్యాస్ ఇన్సులేటెడ్ స్విచ్‌గేర్, బుషింగ్స్ ప్లాంటును ఏర్పాటు చేయనున్న తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంకు, హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ కంపెనీ యూనిట్ ఏర్పాటుకు

మిగతా 2లో...

## బతుకమ్మ, దసరాకు 7 వేల బస్సులు




హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 23(సందేశం టైమ్స్) : బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమవుతోంది. సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 2 వరకు 7 వేలకుపైగా స్పెషల్ బస్సులు నడపాలని ఆర్టీసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేలా ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. గత ఏడాది కంటే ఈసారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. ప్రయాణికుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామని అధికారులు తెలిపారు. టికెట్లన్ను జటట్టఛిఛరట.జ్ఞీ? లో బుక్ చేసుకోవాలని సూచించారు. స్పెషల్ సర్వీసుల సమాచారం కోసం 040-69440000, 040-23450033ను సంప్రదించాలని కోరారు.

# మేడారం జాతరకు జాతీయ హెూదా ఇవ్వాలి

దర్శించుకుంటున్నానని తెలిపారు. 2023 ఫిబ్రవరి 6న మేడారం సమ్మక్క, సారలమ్మ ఆశీర్వాదం తీసుకుని ఇక్కడి నుంచే పాదయాత్రకు పూనుకున్నానని, దొరల పాలన నుంచి ప్రజాపాలన తీసుకవస్తామని ప్రకటించానని తెలిపారు. ఆ తల్లుల దీవెనలతో ప్రజలు ఆశీర్వదించారని, నేడు అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు.

**గద్దెల పునఃనిర్మాణం గొప్ప అవకాశం..**

సమ్మక్క, సారలమ్మ గద్దెల, ప్రాంగణ అభివృద్ధి పునఃనిర్మాణ కార్యక్రమం తనకు, మంత్రి సీతక్కకు ఈ జన్మలో లభించిన గొప్ప అవకాశమని సీఎం రేవంత్ అన్నారు. ఇది బాధ్యత కాదని, బాధ్యతతో కూడిన భావోద్వేగమని చెప్పారు. ఈ ఆలయ అభివృద్ధికి తాము ఎన్ని కోట్లయినా ఖర్చుపెడతామన్నారు. ప్రకృతి దేవతల చరిత్ర రాబోయే వందల, వేల ఏళ్లు నిలిచి ఉండేలా గద్దెలు, ప్రాంగణం పునఃనిర్మించేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. గిరిజనులు, ఆదివాసీల సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలని ఆలోచనతో పూజారులు, అదివాసీల అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడకు వచ్చానని అన్నారు. ఆదివాసీల సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా పునఃనిర్మాణ పనులు జరపాలనేదే తమ అభిమతమని స్పష్టం చేశారు. అందుకే అభివృద్ధి పనుల్లో ఆదివాసీలనూ భాగస్వాములను చేస్తామన్నారు. సిమెంట్‌తో కట్టిన ఏ కట్టడమైనా వందేళ్ల జీవితకాలమే ఉంటుందని, రాతితో నిర్మిస్తే వందల, వేల ఏళ్ల జీవితకాలం ఉంటుందని సీఎం తెలిపారు. అందుకే సమ్మక్క, సారలమ్మ గద్దెలు, ప్రాంగణాన్ని రాతితో నిర్మించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ పనులను వచ్చే ఏడాది జాతర ప్రారంభానికి ముందే వంద రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఆలయంతో పాటు జంపన్నవాగు, రహదారుల నిర్మాణం కూడా పూర్తి చేస్తామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ డిజైన్ వీడియోను సభా వేదికపై ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. మాస్టర్‌ప్లాన్‌కు సభికుల నుంచి ఆమోదం తీసుకున్నారు.

**ఆదివాసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..**

అభివృద్ధి అంటే అద్దాల మేడలు, రంగుల గోడలే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమని సీఎం రేవంత్ అన్నారు. ముఖ్యంగా ఈ దేశ మూలవాసులైన ఆదివాసీలు, గిరిజనుల ప్రాంతాలను అభివృద్ధిలో ముందుకు నడిపించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇండ్లు, రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరుచేశామని చెప్పారు.

**ఒకే వరుసలో గద్దెలు.. గ్రానైట్‌తో సుందరీకరణ**

మేడారంలో ప్రస్తుతం ఉన్న దేవతల గద్దెలను ఒకే వరుసలో నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను ఒకే వరుసలో నిర్మించనున్నారు. సమ్మక్క, సారలమ్మ పాత గద్దెలను ముట్టుకోకుండానే చుట్టూ గ్రానైట్‌తో సుందరీకరించనున్నారు. అలాగే సారలమ్మ గద్దె తరువాత వరుస క్రమంలో పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను కొత్తగా నిర్మించనున్నారు. ప్రస్తుతం గద్దెల ప్రాంగణంలో ఉన్న చెట్లతోపాటు ఏ కట్టడాన్నీ కూల్చకుండా సాలారాన్ని నాలుగు వైపులా 20 అడుగుల చొప్పున విస్తరించేలా రూపకల్పన చేశారు. నాలుగు ప్రవేశ ద్వారాలతో పాటు మరో నాలుగు బయటకు వెళ్లే ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు.

# సూర్యాపేట హాస్పిటల్స్, నిర్ధారణ కేంద్రాలకు కఠిన నిబంధనలు

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్


### జిల్లాలో హాస్పిటల్స్, రోగ నిర్ధారణ కేంద్రాలు నిబంధనలు పాటిస్తేనే అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు.




సూర్యాపేట, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ (డీ ఆర్ ఏ) కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్, పి సి పి ఎన్ డి టి యాక్ట్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో తాత్కాలిక అనుమతి ఇవ్వడం, అనంతరం క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేసి అన్ని నియమ నిబంధనలు పాటిస్తేనే శాశ్వత అనుమతి ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే నోటీసులు జారీ చేసి, కారణాలు తెలపకపోతే తిరస్కరించాలని, అయితే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని చెప్పారు.హాస్పిటల్స్‌లో అనుమతి పొందిన డాక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారా? లేక వారి స్థానంలో మరెవరు పనిచేస్తున్నారా? ఒకే డాక్టర్ అనేక హాస్పిటల్స్‌లో పని చేస్తున్నారా? అనే వివరాలు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే రోగ నిర్ధారణ కేంద్రాలలో అర్హత కలిగిన వారికే అనుమతులు ఇవ్వాలని, రిపోర్టులపై తప్పనిసరిగా డాక్టర్ సంతకం ఉండాలని, స్కానింగ్ సెంటర్లలో నిపుణులైన రేడియాలజిస్టులు ఉండాలని ఆయన ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ అర్హత లేని వారు వైద్యం చేయడం, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డీఎంహెచ్వో పి. చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు జి. చంద్రశేఖర్, నాజియా, కోటిరత్నం, డిప్యూటీ డీఎంహెచ్వో జయ మనోహరి, మీడియా అధికారి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్‌లో రూ.2 కోట్ల బంజారా భవన్‌కు మంజూరు

## బంజారా నాయకుల నుండి ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డికి ధన్యవాదాలు





సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 23: నారాయణఖేడ్ పట్టణంలోని వెంకటాపూర్ గేట్ సమీపంలోని రామారావు మహారాజ్ ట్రస్ట్ స్థలంలో రూ. 2 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న బంజారా భవన్‌కు మంజూరు పొందిన నేపథ్యంలో, నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారిని బంజారా సమాజానికి చెందిన ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత పదేళ్లుగా గిరిజనులు, గిరిజన తండాలు అభివృద్ధి దిశగా పట్టించుకోని గత టీఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గిరిజనుల అభివృద్ధికి గణనీయమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బంజారా భవన్ నిర్మాణం ద్వారా పేద గిరిజనులకు వివాహాలు, శుభకార్యాలు నిర్వహించుకునేందుకు తగిన వేదిక లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు.అలాగే, గిరిజన తండాల అభివృద్ధికి నేడు జరుగుతున్న శ్రమ పట్లోళ్ల కుటుంబం సేవా పరంపరలో భాగమేనని వారు గుర్తు చేశారు. గతంలో మీ తండ్రి స్వర్గీయ పట్లోళ్ల కిష్టారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులకు అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని, ఇప్పుడు మీరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మళ్లీ అదే దారిలో గిరిజన తండాలు అభివృద్ధి చెందుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డితో పాటు, బంజారా నాయకుడు, భవాని అమ్మవారి దీక్ష స్వాములు, శేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు

# ఇన్ని రోజులూ పేదల రక్తం తాగారు

జీఎస్టీని తెచ్చి పేదల నడ్డి విరిచిందీ.. ఇప్పుడు తగ్గించిందీ వారే!" అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. జీఎస్టీ తగ్గింపు అంతా ఎన్నికల డ్రామా అంటూ కొట్టి పారేశారు. జీఎస్టీ తగ్గింపుతో తెలంగాణ రాష్ట్రానికి ఏర్పడుతున్న రూ.7 వేల కోట్ల నష్టాన్ని పూడ్చే బాధ్యత కేంద్రానిదేనని, ఈ విషయంలో కేంద్రంతో మాట్లాడే బాధ్యతను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు తీసుకోవాలన్నారు.పెట్రోల్, డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి ఇప్పటిదాకా ఎందుకు తేలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసిన కొన్ని ల్యాండ్ క్రూజర్ వాహనాలపై దర్యాప్తు చేయించి అవకతవకలు ఉంటే చర్యలు తీసుకుంటా మన్నారు. వీటికి సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని రవాణా శాఖ కమిషనర్‌కు సూచించానని తెలిపారు.

# కృష్ణా జలాల్లో 70 శాతం వాటా ఇవ్వాల్సిందే!

మొత్తం 1050 టీఎంసీల్లో దాదాపు 70 శాతం అంటే 763 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని చెప్పారు. కృష్ణా ట్రైబ్యునల్ ముందు స్వయంగా నీటి పారుదల శాఖ మంత్రి హాజరుకావడం దేశంలో ఇదే మొదటిసారన్నారు. తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఉత్తమ్ తెలిపారు. సగటు ప్రవాహాలపై మిగిలిన మొత్తం నీటిని వినియోగించుకునే హక్కు తెలంగాణకే ఉందన్నారు. ఇది కేవలం డిమాండ్ మాత్రమే కాదని, దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరి చేసే చర్య అని చెప్పారు. కేడబ్ల్యూడీటీ–2 అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1005 టీఎంసీలు కేటాయించిందని గుర్తుచేశారు. సగటు ప్రవాహాల కంటే ఎక్కువగా వచ్చే నీటిని కూడా వినియోగించుకునే స్వేచ్ఛను ఇచ్చారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్తగా బేసిన్ పారామీటర్ల ఆధారంగా వాటాను కోరుతున్నామని తెలిపారు. క్యాచ్‌మెంట్ ఏరియా, జనాభా, కరవు ప్రాంత విస్తీర్ణం, సాగు భూములు వంటి అంశాల ఆధారంగా లెక్కలు వేశామని.. మొత్తం 763 టీఎంసీలు రావాల్సి ఉందని చెప్పారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించిన 811 టీఎంసీల్లో పెద్ద మొత్తాన్ని బేసిన్ వెలుపలికి మళ్లించిందని ఆరోపించారు.

# రేషన్ డీలర్లతో చెలగాటం వద్దు

పలువురు రేషన్‌డీలర్లు మంగళవారం ఆయన్ను కలిసి తమ సమస్యలు వివరించారు. ప్రభుత్వం ద్వారా తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుమాట్లాడుతూ.. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీరుస్తున్న రేషన్‌డీలర్లు.. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి ఏర్పడిందన్నారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక డీలర్లు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోందన్నారు. అభయ హస్తం పేరిట ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్‌డీలర్లకు 5 వేల గౌరవ వేతనంతోపాటు కమీషన్ పెంచుతామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ సర్కార్ విస్మరించిందన్నారు. మాటలు తప్ప చేతల్లేని కోతల ప్రభుత్వమిదని మండిపడ్డారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆరు నెలల కేంద్రప్రభుత్వ కమీషన్, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన సెప్టెంబరు నెల కమీషన్‌ను విడుదల చేయాలని, కాంగ్రెస్ హామీ ప్రకారం రూ. 5 వేల గౌరవవేతనం, కమీషన్ పెంపును తక్షణం ప్రకటించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలోకి 3,745 కోట్ల పెట్టుబడులు

మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిందని వివరించారు. భారీగా పెట్టుబడులు పెడుతూ యువత, పండ్ల సాగు రైతులను ప్రోత్సాహించేలా బహుళ జాతి కంపెనీలు రాష్ట్రానికి తరలి వస్తున్నాయన్నారు. హిందుస్థాన్ కోకాకోలా యూనిట్ ద్వారా రూ. 2,398 కోట్ల పెట్టుబడులు, 600 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. రూ. 785 కోట్ల పెట్టుబడితో వస్తున్న జేఎసడబ్ల్యూ కంపెనీ ద్వారా 364 మందికి ఉపాధి లభిస్తుందని, రూ. 562 కోట్ల పెట్టుబడితో వస్తున్న తోషిబా కంపెనీ ద్వారా 554 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. దావోసతో పాటు వివిధ దేశాల నుంచి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబర్చిన వివిధ కంపెనీల తాజా పరిస్థితి, జరిగిన ఎంవోయూలు, విధి విధానాలను క్యాబినెట్ సబ్‌కమిటీ సమీక్షించింది

# గ్రామ పంచాయతీ కార్మికులకు బట్టలు పంపిణి చేసిన హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్





సందేశం టైమ్స్ న్యూస్ నారాయణాఖేడ్ ప్రతినిధి సెప్టెంబర్ 23: అల్లాదుర్గం మండల పరిధిలోని బహిరందిబ్బ గ్రామ పంచాయతి కార్మికులకు దసరా పండగ సందర్భంగా జగదేవపూర్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బహిరందిబ్బ గ్రామానికి చెందిన బోయిని జనార్దన్ తండ్రి విఠల్ బట్టలు పంపిణి చేయడం జరిగింది ఇందులో గ్రామ పెద్దలు పాంపాటి వీరప్ప మాజీ సర్పంచ్ కోర్మని ప్రభు, యువకులు బస్వరాజ్, పి శ్రీకాంత్, మహేష్, టీ.శ్రీకాంత్, యన్.సంగమేష్, పి రమేష్ పాల్గొన్నారు గ్రామపంచాయతీ కార్మికులు వారికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పసుపు గోడౌన్‌కు మళ్లీ సీల్



దుగ్గిరాల సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):గతేడాది అగ్ని ప్రమాదానికి గురైన స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో వెనుక భాగంలో ఉన్న 1169 బస్తాల పసుపును అప్పట్లో అధికారులు సీలు వేయగా ఆ పసుపును కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం గ్రేడింగ్ చేస్తున్నట్లు కలెక్టర్, కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ దృష్టికి బాధిత రైతులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కోల్డ్ స్టోరేజీని తహశీల్దార్ ఐ.సునీత, యార్డు సెక్రెటరీ జె.సుబ్బారావు విచారణ చేపట్టారు. గోడౌన్‌కు మళ్లీ సీల్ వేశారు. అయితే ఆ బస్తాలు తమకివ్వాలని బాధితులు కోరుతున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశ్వరి, బాధితులు వి.వెంకటరామయ్య, జి.శ్రీహరి, వి.వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కె.శేషగిరి, విఆర్ఒలు పాల్గొన్నారు.

# పొంగి ప్రవహిస్తున్న ముగ్గురాళ్ల వాగు



టి.నరసాపురం సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి ముగ్గురాళ్ల వాగు, జలవాగు మళ్లీ పొంగి ప్రవహిస్తున్నాయి. ఇటీవల భారీ వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని బండివారిగూడెం మక్కినవారిగూడెం, టి.నరసాపురం మక్కినవారిగూడెం గ్రామాల మధ్య రెండు రోజుల పాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి. మరోసారి రాత్రి భారీ వర్షం కురవడంతో ముగ్గురాళ్లవాగు, జలవాగు వంతెనపై నుంచి పొంగి ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసు సిబ్బంది వాగును పరిశీలించి రోడ్లను నిర్బంధించి ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. అయితే వర్షాలు కురిసిన ప్రతిసారి వాగులు ఉధృతి ఉండడం, వంతెనల నిర్మాణాలు సరిగా లేకపోవడం వల్లే అని కాలువల ప్రవాహం అంచనా వేసి అధికారులు వంతెనలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గుంటూరులో నాలుగు కలరా కేసులు

## 4 నమూనాల్లో విబ్రియో బ్యాక్టీరియా, 16 నమూనాల్లో ఈ.కోలి



గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):భయపడినట్టే గుంటూరులో కలరా నిర్ధారణ అయింది..! జిల్లాలో నాలుగు కలరా కేసులు బయటపడ్డాయి. ఇందులో గుంటూరు నగరంలో మూడు, తెనాలిలో ఒకటి ఉన్నాయి. గుంటూరులో ఐదు రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ 146 మంది డయేరియా బారినపడ్డారు. వీరంతా గుంటూరు జీజీహెచ్‌తో పాటు ప్రైవేటు వైద్యశాలల్లో చేరారు. ఇప్పటి వరకు 62 మంది కోలుకొని డిశ్చార్జి అయ్యారు. ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా ఉన్న రోగుల నుంచి 114 నమూనాలను సేకరించి గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ ల్యాబ్‌లో పరీక్షించగా 91 నమూనాల ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో మూడు నమూనాల్లో 'విబ్రియో కలరే' బ్యాక్టీరియా, 16 నమూనాల్లో ఈ.కోలి బ్యాక్టీరియా, ఒకదానిలో షిగెల్లా బ్యాక్టీరియా ఉన్నట్టు నిర్ధారించారు. 71 నమూనాల్లో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలింది. తెనాలి మండలం అంగలకుదురులో ఒక యువతి కలరా బారినపడినట్టు ప్రైవేటు వైద్యశాలలో నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైంది.కలరా వేగంగా వ్యాపించే అంటువ్యాధి కావడంతో అధికార యంత్రా ంగం అప్రత్తమైంది. వైద్యఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ హుటాహుటిన గుంటూరు కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కలరా ప్రబలిన పాతగుంటూరు బాలాజీ నగర్ ప్రాంతాన్ని హాట్‌స్పాట్‌గా ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. గుంటూరులో ప్రబలిన కలరాకు కలుషిత నీరే ప్రధాన కారణమని భావిస్తున్నారు. వర్షాల కారణంగా నీరు కలుషితమై ఉంటుందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యవర్గాలు విజ్ఞప్తి చేశాయి.

# అచ్చభలో విషాదం



సీతంపేట సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):: నిన్న వరకూ పాఠశాలలో చదువుకొని దసరా సెలవులకు సొంత గ్రామంలో సరదాగా గడుపుదామని, ఈత కోసం చెరువుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థినిలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలో పెద్దగూడ పంచాయతీ అచ్చభలో చోటు చేసుకున్న విషాదకర సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెద్దగూడ పంచాయతీ అచ్చబ గ్రామానికి చెందిన కొండగొర్రె మౌనిక (12) ఏడో తరగతి, పాలక రాజి అలియాస్ అంజలి (11) మండలంలోని ముత్యాలు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. నుంచి దసరా సెలవులు కావడంతో సొంత గ్రామానికి వచ్చారు. సోమవారం వీరు విషిత, శ్రావ్యతో కలిసి గ్రామ శివారులో గల చెరువు స్నానాకి వెళ్లారు. తొలుత చెరువులోకి మౌనిక, అంజలి దిగి తిరిగి ఒడ్డుకు రాకపోవడంతో మిగిలిన ఇద్దరూ గ్రామంలోకి వెళ్లి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో పోలీసులకు, రెవెన్యూ శాఖకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆర్ఐ విజయ గణేష్‌బాబు గ్రామాన్ని సందర్శించి స్టేట్మెంట్ రికార్డు చేశారు. ఇద్దరు ఒకే పాఠశాలలో, ఒకే గ్రామం ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దోనుబాయి ఎస్ఐ షేక్ మస్తాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జీఎస్టీ తగ్గింపు

# మధ్య తరగతి కుటుంబాలకు ఊరట




ఎమ్మిగనూరు సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):వస్తు సేవల పన్ను జీఎస్టీ తగ్గింపు మధ్య తరగతి కుటుంబాలకు ఊరట అని అత్మనిర్భార్ ఎమ్మిగనూర్ నియోజకవర్గం ఇనచార్జ్ గురురాజ్ దేశాయ్, జిల్లా కార్యదర్శి దయాసాగర్ అన్నారు. బీజేపీ కార్యకర్తలు రెవెన్యూ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరి సోమప్ప సర్కిల్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మధ్యతరగతి కుటుం బాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందన్నారు. మధ్య తరగతి కుటుంబాలకు దసరా కానుకగా మోదీ జీఎస్టీని తగ్గించి పండుగను వారం రోజులు ముందుగానే తెచ్చారన్నారు. దీని ద్వారా 400 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ నారాయణ, లలితజైన, చరణ్, శిల్పి భాస్కర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# డ్వాక్రా సభ్యులకు రూ.11లక్షల టోకరా

తిరుపతిరూరల్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): డ్వాక్రా సంఘాలకు చెందిన రూ.11లక్షలకుపైగా మొత్తాన్ని ఓ సంఘమిత్ర స్వాహా చేసిన ఘటన బయటపడింది. వివరాలిలా.. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీలోని ఎస్టీకాలనీలో మూడు డ్వాక్రా సంఘాలున్నాయి. ఈ సభ్యులకు తెలియకుండా రూ.11లక్షలకు పైగా సొమ్మును విడతలవారీగా సంఘమిత్ర చెంచులక్ష్మి తీసుకున్నారు. అడిగినప్పుడల్లా బ్యాంకులో చెల్లించామని చెప్పేవారు. వార్షిక బడ్జెట్- జీవనోపాధుల ప్రణాళికలో బయోమెట్రిక్ వేసిన సందర్భంలో బ్యాంకులో అప్పు ఉన్నట్లు సభ్యులు గుర్తించారు. అనుమానంతో బ్యాంకు పుస్తకాలను తీసుకురమ్మంటే సంఘమిత్ర దాటవేత ధోరణితో సమాధానం చెప్పేవారు. దీంతో బ్యాంకు స్టేట్‌మెంట్ పరిశీలించగా రూ.11లక్షలకుపైగా స్వాహా చేసినట్లు గుర్తించారు. దీనిని 'మనడబ్బులు- మనలెక్కలు' యాప్ ద్వారా ధ్రువీకరించుకున్నారు. దీనిపై మండల వెలుగు ఏపీఎం నాగేశ్వరరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రూ.11లక్షలు స్వాహా చేసినట్లు గుర్తించామన్నారు. విచారణ జరిపి. రికవరీకి చర్యలు చేపడతామన్నారు.

# నోటికి ప్లాస్టర్.. ముక్కుకు క్లిప్పు




గుంటూరు, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):గుంటూరులోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఆత్మహత్య చేసుకుంటానన్న విషయం ముందుగా స్వగ్రామంలో తల్లిదండ్రులకు తెలియగా, వారు కూతురిని కాపాడుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన త ర్వాత నోటికి టేపు, ముక్కుకు క్లిప్పు పెట్టుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆత్మహత్యకు దారితీసిన కారణాలు తెలియరాలేదు. పట్టాభిపురం పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా దెందులూరుకి చెందిన కమ్మ రాజు, రాధిక దంపతు ల కుమార్తె శ్రావ్య(20) నంబూరు సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతోంది. గుంటూరు అశోక్ నగర్‌లోని ఓ ప్రైవేటు ఉమెన్స్ హాస్టల్లో ఉంటోంది. రాత్రి 8:30 గంటల సమయంలో శ్రావ్య విజయవాడలో ఉన్న తన స్నేహితురాలు జాగృతికి ఫోన్ చేసి.. ఆత్మహత్య చేసుకోవాలని ఉందని చెప్పిం ది. దీంతో కంగుతిన్న జాగృతి.. శ్రావ్య అన్నయ్య కు, కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. విషయం చెప్పింది. వెంటనే వారు శ్రావ్యకు ఫోన్ చేసి మాట్లాడారు. అయితే, మనసు బాగోలేక అలా అన్నానని, ఆత్మహత్య చేసుకోనని చెప్పింది. అయినప్పటికీ తల్లిదండ్రులు.. వెంటనే శ్రావ్య ఉంటున్న హాస్టల్ గదిలో ని తోటి విద్యార్థినులకు ఫోన్ చేశారు. జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. అయితే రాత్రి సమయంలో శ్రావ్య గది బయట కుర్చీ వేసుకొని కూర్చుని ఉంది. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఇన్‌స్టా మార్ట్ లో టేపు, క్లిప్స్ ఆర్డర్ పెట్టింది. పది నిమిషాల్లో డెలివరీ బాయ్ ఆర్డర్ ఇచ్చి వెళ్లాడు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో బయట వరండాలోనే శ్రావ్య నోటికి ప్లాస్టర్, ముక్కుకు క్లిప్పు పెట్టుకొని చలనంలేకుండా పడిపోయి కనిపించింది. శ్రావ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన హాస్టల్ వద్దకు చేరుకున్నారు. పట్టాభిపురం సీఐ ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. కుటుంబ సభ్యులకు శ్రావ్య మృతదేహాన్ని అప్పగించారు.

# వైద్యం కోసం వెళ్తూ...



నారాయణవనం సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): వైద్యం కోసం వెళ్తున్న తల్లీకొడుకులను కారు ఢీకొని దుర్మరణం చెందారు. నారాయణవనం మండలం టాసా ఫ్యాక్టరీ వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా నింద్ర మండలం ఐఆర్‌కండ్రికు చెందిన మునెమ్మ(47)ను ఆమె కుమారుడు బాలాజి(28) ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని తిరుపతిలోని ఆస్పత్రికి బయలుదేరారు. టాసా ఫ్యాక్టరీ వద్ద పాలమంగళం నుంచి వస్తున్న కారు వీరి బైకును ఢీకొనడంతో తల్లీకొడుకులు ఎగిరి రోడ్డు మీద పడి అక్కడికక్కడే మృతి చెందారు. మునెమ్మ భర్త కేశవులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలాజి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. భార్య, కుమారుడి మృతదేహాలను చూసి విలపిస్తున్న కేశవులును ఓదార్చడం ఎవరివల్ల కాలేదు.

# చికెన్ కూర వండలేదని భర్త ఆత్మహత్య



ఎర్రగొండపాలెం రూరల్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): నచ్చిన కూర భార్య వండలేదని మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని గోళ్లవిడిపి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇళ్ల లక్ష్మీనారాయణ (25) భార్యతో తరచూ గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో చికెన్ కూర వండాలని చెప్పడంతో భార్య వినకపోవడంతో మనస్తాపానికి గురై పొలాల్లోకి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి ఏడాదిన్నర బాబు ఉన్నాడు. లక్ష్మీనారాయణ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# ఛ్ఛే... జీఎస్‌టీపై వినియోగదారుల పెదవి విరుపు

◆ జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుకాని కొత్త శ్లాబులు
◆ కేంద్రం ఆదేశించినా పట్టించుకోని వ్యాపారులు
◆ పాత ధరలనే వసూలు చేసిన వైనం
◆ నిత్యావసర సరకుల ధరల్లో ఎటువంటి మార్పూ లేదు
◆ ఎలక్ట్రికల్ వస్తువులు, ఫుట్‌వేర్, కార్లు, బైకుల రేట్లు మాత్రం తగ్గింపు



విశాఖపట్నం సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి అమలుచేసిన జీఎస్టీ నూతన శ్లాబుల విధానం జిల్లాలో తొలిరోజు పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇప్పటివరకూ అమల్లో ఉన్న 5, 12, 18, 28 శాతం శ్లాబుల స్థానంలో, కేవలం 5, 18 శాతం శ్లాబులను కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు నుంచి కొత్త శ్లాబులను అనుసరించి విక్రయాలు సాగించాలని ఆదేశించింది. అయితే జిల్లాలో అనేక వస్తువుల ధరలను తగ్గించేందుకు వ్యాపారులు ఇష్టపడలేదు. ముఖ్యంగా నిత్యావసర సరకులు, మందులు, ఫుట్‌వేర్, వస్త్రాలపై నూతన జీఎస్టీని అనుసరించి ధరలను తగ్గించాల్సి ఉండగా, వ్యాపారులు పట్టనట్టు వ్యవహరించారు. వినియోగదారులు ప్రశ్నిస్తే పూర్తిస్థాయిలో సమాచారం రాలేదని వాదిస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటికే తాము జీఎస్టీ చెల్లించి కొనుగోలు చేసిన సరకులను తగ్గించి అమ్మడం సాధ్యం కాదన్నారు. కాగా ఎలక్ట్రికల్ వస్తువులు, కార్లు, బైక్‌లపై తగ్గిన శ్లాబులు అమల్లోకి వచ్చాయి. వాటికి దసరా ఆఫర్లు తోడవ్వడంతో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఎగబడ్డారు.

**తగ్గాల్సిన వస్తువులు ఇవే..**

మిల్క్, చీజ్, పిజ్జా, బ్రెడ్, చపాతీ, రోటీ, కొన్ని రకాల మందులు, నోట్‌బుక్స్, ఎక్సర్‌సైజ్ బుక్స్, పెన్సిల్స్, షార్ప్‌నర్స్, క్రయాన్స్ వంటివి 12 శాతం శ్లాబు నుంచి జీరో శ్లాబులోకి మార్చారు. అంటే వీటిపై జీఎస్టీ వసూలు చేయకూడదు. అలాగే కండెన్స్‌డ్ మిల్క్, బటర్, నెయ్యి, చీజ్, రూ.2,500 కంటే తక్కువ ధర గల ఫుట్‌వేర్, వస్త్రాలు, కాటన్, జ్యూట్ హ్యాండ్‌బ్యాగ్స్, కొన్నిరకాల ఫర్నిచర్, కిరోసిన్ స్టవ్, లాంతర్లు, డ్రైఫూట్స్, దయాబెటిక్ ఫుడ్స్, వ్యవసాయ యంత్రాలు, సౌరశక్తి పరికరాలు 12 శాతం నుంచి ఐదు శాతం శ్లాబ్‌లోకి మార్చారు. టాల్కమ్ పౌడర్, షాంపూ, హెయిర్ ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్, కేక్, బిస్కెట్స్, కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్, ఐస్‌క్రీమ్, మినరల్ వాటర్ కూడా ఐదు శాతం శ్లాబులోకి వచ్చాయి. ఎయిర్ కండిషన్లు, డిష్, వాషింగ్ మెషీన్లు, 1200 సీసీ కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల పెట్రోల్, 1500 సీసీ కంటే తక్కువ ఇంజన్ సామర్థ్యం గల డీజిల్ వాహనాలు 28 శాతం నుంచి 18 శాతం జీఎస్టీ శ్లాబులోకి మారాయి.


**తగ్గింపు వీటికే పరిమితం**

తగ్గిన జీఎస్టీ శ్లాబులను జిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే అమలుచేశారు. మిల్క్, చీజ్, నెయ్యిలపై తగ్గింపు ధరలు అందుబాటులోకి వచ్చాయి. పాలు (లీటరు)పై రూ.3 వరకు తగ్గగా, 500 గ్రాముల నెయ్యిని కంపెనీని బట్టి రూ.20 నుంచి రూ.40 వరకు తగ్గించారు. పన్నీర్ ధర కిలోకు రూ.20 నుంచి రూ.25 వరకు తగ్గింది. మిల్క్ షేక్‌లు, ఫ్లమ్ కేక్స్‌పై రెండు నుంచి ఐదు రూపాయల వరకు తగ్గింది. కాగా మరికొన్ని కంపెనీలు పాత ధరలకే విక్రయిస్తున్నాయి. 28 శాతం జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో కార్లు, బైక్‌ల ధరలు దిగి వచ్చాయి. కంపెనీ ధరను బట్టి కనిష్ఠంగా రూ.ఆరు వేల నుంచి రూ.15 వేలు వరకు తగ్గింది. కార్ల ?ధరలు భారీగా తగ్గాయి. ఒక్కో కారుపై రూ.60 వేల నుంచి రూ.1.1 లక్షల వరకు తగ్గినట్టు షోరూమ్ యజమానులు చెబుతున్నారు.వాల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు భారీగా రేట్లు తగ్గించాయి. ఇద్దరు పిల్లలున్న కుటుంబానికి (వయసును బట్టి) రూ.10 లక్షల పాలసీకి ఇప్పటివరకూ రూ.24 వేల నుంచి రూ.28 వేల వరకు వసూలు చేస్తుండగా, దీనిపై జీఎస్టీని పూర్తిగా మినహాయించడంతో రూ.19 వేల నుంచి రూ.20 వేల మధ్య అందుబాటులోకి వచ్చాయి. ఇక ఏసీ, డిష్ వాషర్, టీవీలు 28 శాతం నుంచి 18 శాతం శ్లాబుల్లోకి మార్చడంతో ధరలు తగ్గాయి. సామర్థ్యాన్ని బట్టి ఏసీపై రూ.2,500 నుంచి రూ.5 వేల వరకు, డిష్ వాషర్‌పై రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, టీవీలపై రూ.4 వేల నుంచి రూ.పది వేలు తగ్గించి విక్రయిస్తున్నారు.

**తగ్గని వస్తువులు ఇవే..**

జీఎస్టీ శ్లాబులు మేరకు ధరలను తగ్గించి విక్రయించాలని కేంద్రం ఆదేశించినప్పటికీ అనేక మంది వ్యాపారులు పట్టించుకోలేదు. పౌడర్, షాంపూ, హెయిర్‌ఆయిల్, టూత్‌పేస్ట్, చాక్లెట్స్, కేక్, బిస్కెట్స్, కాఫీ, టీ ఎక్స్‌ట్రాక్ట్స్, ఐస్‌క్రీమ్, మినరల్ వాటర్, మెడిసిన్స్ ధరలు తగ్గలేదు. వస్త్రాలు, ఫుట్‌వేర్, మందులకు పాత ధరలే వసూలు చేశారు. అయితే బిల్లులో తగ్గిన జీఎస్టీలను చూపిస్తూ డిస్కౌంట్ రేట్లను పెంచి వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా తాము ఇప్పటికే జీఎస్టీ చెల్లించి సరకులు కొనుగోలు చేశామని, వాటిని తగ్గించి విక్రయిస్తే నష్టపోతామని కొందరు వ్యాపారులు...వినియోగదారులతో వాదనకు దిగారు. ఆయా శ్లాబులకు అనుగుణంగా తగ్గిన ధరలతో కూడిన బోర్డులను ఏర్పాటుచేయాలని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మాలా సీతారామన్ ఇచ్చిన ఆదేశాలను ఎక్కడా అమలు చేయడం లేదు. కొద్దిచోట్ల మాత్రం 'తగ్గించిన జీఎస్‌టీ రేట్లు వర్తింపజేస్తున్నాము' అంటూ బోర్డులు పెట్టారు తప్ప ధరల వివరాలేవీ కనిపించలేదు. కేంద్రం వస్తు సేవల పన్ను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఆదివారం ధరలకు, సోమవారం ధరలకు పెద్ద తేడా కనిపించలేదు. తొంభై శాతానికిపైగా నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి మార్పు లేదు. నగరంలోని డిపార్టుమెంట్ స్టోర్లు, మార్టులు ఎంఆర్‌పీపై 3 నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్లు ఇస్తుంటాయి. ఉదాహరణకు ఒక మార్ట్‌లో లీటర్ ఫ్రీడమ్ ఆయిల్ ఎంఆర్‌పీ రూ.173 ఉంటే 25 శాతం డిస్కౌంట్‌తో రూ.148కు విక్రయిస్తున్నారు. ఆదివారం గ్రాస్ అమౌంట్ రూ.130.24ం జీఎస్టీ రూ.17.76 (12 శాతం) కలిపి రూ.148 బిల్లు చేశారు. కొత్త జీఎస్టీ అమలుతో సోమవారం అదే ఆయిల్ ఎంఆర్‌పీపై 20 శాతం డిస్కౌంట్ సేల్ పెట్టి గ్రాస్ అమౌంట్ రూ.140.6 ప్లస్ జీఎస్టీ రూ.7.4 కలిపి రూ.148 బిల్లు చేస్తున్నారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం డిపార్టుమెంట్ స్టోర్లు కూడా డిస్కౌంట్ తగ్గించి 21వ తేదీ వరకు ఉన్న ధరలకే సర్దుబాటు చేస్తున్నాయి. అందువల్ల నిత్యావసర వస్తువులపై తగ్గిన జీఎస్టీ పెద్ద ప్రభావం చూపలేకపోయింది. ఇక వీధుల్లో కిరాణా దుకాణాల్లో అయితే జీఎస్టీతో సంబంధమే లేదు. అక్కడ బిల్లులు ఏమీ ఉండవు. దుకాణదారులు నిర్ణయించుకున్న ధరకు వినియోగదార్లు కొనుగోలు చేసుకోవాల్సిందే.

## వర్షానికి నీట మునిగిన మొక్కజొన్న



తనకల్లు సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): మండలంలోని బొం తపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు వంకలు, వాగులు, చెరువులు, కుంటలు పొంగిపోర్లాయి. బొంతలపల్లికి చెందిన రామిరెడ్డి మూ డున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారు. పంట సాగు చేయడానికి రూ.50వేలుకు పైగా ఖర్చు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో భారీగా కురిసిన వర్షాలకు పూర్తిగా నీటిలో మునిగి పోయింది. గ్రామానికి చెందిన రంగప్ప, రమేష్ సాగుచేసిన రెండు ఎకరాల మొక్కజొన్న పంట పైనున్న కాలువలు పొంగడంతో పూర్తిగా నేలమట్టమైంది. రూ. 5లక్షలు నష్టం జరిగినట్లు బాధితు లు ఆవేదన చెందారు. పంట చేతికొస్తుందన్న తరుణంలో వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతినిందని బాధపడ్డారు. ప్రభుత్వం పరి శీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ఆదుకోవాలని కోరారు.

## సెంట్రల్ జైలు ఖైదీ పరారీ



దేవరపల్లి సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వాయిదా నిమిత్తం విజయవాడ తీసుకెళ్లి తిరిగి రాజమహేంద్రవరం తీసు కొస్తున్న సమయంలో ఖైదీ బత్తుల ప్రభాకర్ పరారయ్యాడు. దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహ దారి పక్కనున్న గోదావరి రెస్టాంట్ వద్ద టిఫిన్ చేసేందుకు రాత్రి ఎస్కార్ట్ వ్యాను ఆగింది. ఇదే అదునుగా భావించిన ప్రభాకర్ మూత్ర విసర్జన కోసం తీసుకెళ్లమని అడిగి తప్పించుకుని పరారయ్యాడు. దీనిపై దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభాకర్ కోసం గాలిస్తున్నామని, పోలీసుల నుంచి తప్పించుకున్న సమయంలో చేతికి సంకెళ్లు, వైట్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ట్రాక్‌ను ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు 9440796584, 9440796624 నంబ ర్లలో సంప్రదించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు.

## గంధం చెట్లు నరికిన ముగ్గురు మధ్యప్రదేశ్ వాసుల అరెస్ట్



రాజానగరం సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నందరాడలోని ఒక తోటలో గంధం చెట్లు నరి కిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ నిందితుల వివరాలను వెల్లడిం చారు. హైదరాబాద్‌కు చెందిన తన్నీరు విజయ కుమార్‌కు రాజానగరం మండలం నందరాడ గ్రామంలో 12 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం లో కొబ్బరి, మామిడి, టేకు, ఎర్ర చందనం, శ్రీ గంధం చెట్లను పెంచుతున్నారు. సదరు తోటలో దొడ్డా సోమేశ్వరరావు సూపర్‌వైజర్‌గా పనిచేస్తు న్నాడు. ఈనెల 16న సోమేశ్వరరావు పొలం ప నులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లి పోయాడు. 19న ఉదయం తోటమాలి పిన్నమ రాజు సత్యనారాయణ తోటలోకి వెళ్లి చూడగా తోటలో ఉన్న 2 గంధపు చెట్లను ఎవరో నరికి తీసుకెళ్లడం గమనించి సోమేశ్వరరావుకు ఫోన్ లో సమాచారం అందించాడు. దీంతో సోమేశ్వరరావు తోటలోకి వెళ్లి చూడగా గంధం చెట్టు నరికేసి అపహరించినట్లుగా గుర్తించి పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. గంధం చెట్లను మొద లకు కోసి చెట్టు చివరి భాగం వదిలిపెట్టి మొద లు భాగాన్ని ముక్కలుగా నరికి దొంగిలించారు. ఈ మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పర్య వేక్షణలో ఎస్.ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మధ్యప్రదేశ్ నుంచి వ చ్చి సంచార జీవనం చేస్తున్న వ్యక్తులను అను మానితులుగా గుర్తించి ఈ నెల 21న దివాన్ చెరువు సమీపంలో పట్టుకుని విచారించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కట్నీ జిల్లాకు చెందిన జాలిస్ ఆదివాస్, శివరాజ్ ఆదివాసీ, ఉల్లిష్ అలియాస్ టీటూ అనే ముగ్గురుని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి గంధం చెట్ల మాను ముక్కలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ. 10,25,000 ఉంటుందన్నారు.

## జీఎస్టీ సంస్కరణలతో ఊరట



శ్రీకాకుళం/నరసన్నపేట, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చేశాయి. నిత్యావసర సరుకులు, వాహనాలు, ఇన్సూరెన్స్ పాలసీల... ఇలా వీటన్నింటిపై జీఎస్టీ తగ్గింది. ఈ క్రమంలో చాలా వస్తువుల ధరలు తగ్గాయనే చర్చ సాగింది. ధరలు తగ్గితే తమకు ఊరట లభించనుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. కాగా తొలిరోజు జిల్లావాసుల్లో మిశ్రమ స్పందన కనిపించింది. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట, పలాస–కాశీబుగ్గ, ఆమదాలవలస, పాతపట్నం వంటి పట్టణాల్లోని షాపింగ్ మాల్స్‌లో కొనుగోలుదారులు పెద్దగా లేరు. కానీ నిత్యావసరాల సరుకులు, మందుల దుకాణాల వద్ద మాత్రం కాస్త రద్దీ కనిపించింది. జీఎస్టీ సవరణతో నిత్యావసర సరుకుల సంబంధించి సుమారు 13శాతం వరకు ఆదా అవుతుంది. కిరాణా సామగ్రి, వ్యవసాయ పరికరాలు, వస్త్రాలు, మందులు, ఆటోమొబైల్స్ వంటివాటిలో 375 రకాల వస్తువులు ధరలు తగ్గాయి. జీఎస్టీ తగ్గింపుతోపాటు ఆదాయపు పన్నును రూ.12 లక్షల వరకు మినహాయించడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించనుంది.జిల్లాలో దసరా, దీపావళి సమయాల్లో చాలా మందికి కొత్తవస్తువులు కొనుగోలు చేయడం సెంటిమెంట్. జీఎస్టీ సవరణతో కారులు, బైక్‌లు, ఏసీలు, టీవీల ధర బాగా తగ్గిందనే ప్రచారం సాగింది. రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్ల ధర కూడా తగ్గిందని సమాచారం అంతటా తెలిసింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తెలుగులో జీఓ 582ను విడుదల చేసింది. ఏ వస్తువుపై ఎంత శాతం జీఎస్టీ తగ్గిందీ అన్నదీ.. అందులో స్పష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో నిత్యావసర వస్తువులతో పాటు.. కారులు, ఏసీలు, టీవీలు వంటివాటిపై ధరలు ప్రస్తుతం ఎంత ఉన్నాయనే దానిపై ప్రజలు ఆరా తీస్తున్నారు. జీఎస్టీ ధరను తగ్గించి వ్యాపారులు విక్రయిస్తున్నారో లేదోనని పరిశీలిస్తున్నారు. గందరగోళం లేకుండా త్వరలో మంచిరోజున తమకు అవసరమైన వాహనాలు, వస్తువులు కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. దీంతో తొలిరోజు జిల్లాలో పెద్దగా విక్రయాలు జరగలేదు. అలాగే జిల్లా జీఎస్టీ అధికారులు కూడా ప్రజలకు అవగాహన కలిగించేలా తెలుగులో విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను అందరికీ పంపుతున్నారు.

# డివైడర్ దాటి మరో కారు మీద పడిన కారు





రాజాపూర్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):జాతీయ రహదారిపై వెళుతోన్న కారు అదుపు తప్పి డివైడర్ దాటి మరో కారుపై పడడంతో అందులో ప్రయాణిస్తోన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన రంజిత్ రెడ్డి(34) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. పెద్దల పండుగ కోసం భార్య చైతన్య, కుమార్తెలతో కలిసి 20వ తేదీన అత్తగారి ఊరైన పెద్దమందడి మండలంలోని వెల్టూరుకు వచ్చారు. 22వ తేదీన ఉదయం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న అతడి మరదలు(భార్య చెల్లెలు) హారికారెడ్డి(23) కూడా శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేందుకు అతడితో పాటు బయలుదేరింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూలుకు వెళ్తున్న కారు జాతీయ రహదారిపై రాజాపూర్ మండల కేంద్రంలోని రెయిన్‌బో హోటల్ సమీపంలో అదుపు తప్పి డివైడర్ మీదుగా దూసుకొచ్చి వీరు ప్రయాణిస్తున్న కారుపై పడింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మాధవరెడ్డి క్షేమంగా ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని కారులో నుంచి మృతదేహాలను వెలికితీసి జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# వైద్యం వికటించి ఏడేళ్ల బాలిక మృతి



ఉప్పల్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): బోడుప్పల్‌లో అర్హతలు లేకుండా వైద్యుడిగా చలామణి అవుతున్న బాల సిద్ధులు అనే వ్యక్తి చేసిన వైద్యం వికటించి ఏడేళ్ల బాలిక మృతి చెందింది. బోడుప్పల్‌కు చెందిన కొండరాజు, లావణ్య దంపతుల కుమార్తెకు వారం క్రితం జ్వరం రావడంతో సత్యపాలీ క్లినిక్‌కు తీసుకెళ్లారు. సిద్ధులు ఆమెకు వైద్యం చేశాడు. 21న బాలిక ఆరోగ్యం క్షీణించడంతో తల్లిదండ్రులు మళ్లీ క్లినిక్‌కు తీసుకెళ్లారు. టైఫాయిడ్, జాండీస్ అని నిర్ధారించిన సిద్ధులు మందులు ఇచ్చాడు. చికిత్స సమయంలో చిన్నారికి రక్తపు వాంతులయ్యాయి. సాయంత్రం క్లినిక్‌లోనే బాలిక మృతి చెందింది. బాలిక తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన నేపథ్యంలో క్లినిక్‌కు చేరుకున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారులు విచారణ జరిపారు. క్లినిక్‌కు ఎలాంటి అనుమతులు లేవని, బాల సిద్ధులు మెడికల్ కౌన్సిల్‌లో నమోదు పొందిన అర్హత కలిగిన వైద్యుడు కాదని విచారణలో తేల్చారు. క్లినిక్‌ను సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు.

# ఏఐఎంఎల్ సీటు 25 లక్షలు



**బి-క్యాటగిరీ సీట్ల కేటాయింపులో..**
**20 ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలపై భారీగా ఫిర్యాదులు**
**ఎంపికైన విద్యార్థుల జాబితా, ర్యాంకులు ప్రకటించలేదు**
**విద్యార్థులు, తల్లిదండ్రుల ఫిర్యాదు**
**వివరణ కోరిన ఉన్నత విద్యామండలి**

సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):బి-క్యాటగిరీలో యాజమాన్య కోటా సీట్లను ప్రతిభ ఆధారంగా కేటాయించడం లేదంటూ ఇంజనీరింగ్ కాలేజీలపై భారీగా ఫిర్యాదులు అందాయి. ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా 30 శాతం సీట్లను యాజమాన్యాలు అమ్ముకోవచ్చు. అయితే దీనికీ ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయి. తొలి ప్రాధాన్యంప్రవాస భారతీయులకు(ఎన్ఆర్ఐ) ఇవ్వాల్సి ఉంది. ఆ తర్వాత జేఈఈ ర్యాంకు ఆధారంగా ప్రతిభగల వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రెండు విభాగాల్లో పూర్తవకుంటే ఎప్‌సెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు కల్పించాల్సి ఉంది. అయితే నగరంలోని ఇంజినీరింగ్ కాలేజీలు తెలంగాణ ఉన్నత విద్యామండలి జూన్ 17న ప్రకటించిన మార్గదర్శకాలను ఎక్కడా పాటించలేదని, ఇష్టారాజ్యంగా సీట్లు అమ్ముకున్నారని అనేక మంది ఫిర్యాదు చేశారు. కొన్ని కాలేజీలు డొనేషన్లు వసూలు చేశారని తల్లిదండ్రులు ఉన్నత విద్యామండలికి ఫిర్యాదు చేశారు. ఎంపిక చేసిన విద్యార్థుల జాబితా, వారికి వచ్చిన జేఈఈ ర్యాంకు, ఎప్‌సెట్ ర్యాంకుల వివరాలు ప్రకటించలేదన్నారు. కంప్యూటర్ సైన్స్-ఏఐఎంఎల్ బ్రాంచికి ఈసారి భారీగా ఉన్న డిమాండ్‌తో కొన్ని ప్రముఖ కాలేజీలు గరిష్ఠంగా రూ. 25 లక్షల వరకు డొనేషన్ల రూపంలో వసూలు చేశాయని, దానికి ఎలాంటి రసీదులు ఇవ్వలేదని తల్లిదండ్రులు పేర్కొన్నారు. యాజమాన్య కోటా సీట్ల ప్రక్రియ ముగిసినందున.. కాలేజీలు పంపే జాబితాను ఉన్నత విద్యామండలి ఆమోదిస్తేనే బి-క్యాటగిరీ సీట్ల ప్రవేశాలు కొనసాగుతాయి. ఈ సీట్ల పరిశీలన ప్రక్రియ సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ప్రారంభమైంది. ఇప్పటికే విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 20 కాలేజీలకు ఉన్నత విద్యామండలి అధికారులు సోమవారం సంజాయిషీ నోటీసులు పంపారు.

# బతుకమ్మ ఆడుతూ గుండెపోటుతో ఇద్దరి మృతి



కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా)/కోహీర్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):బతుకమ్మ సంబరాల్లో విషా దం చోటు చేసుకుంది. బతుకమ్మ ఆడుతూ గుండెపోటుకు గురై వేర్వేరు ప్రాంతాల్లో రాత్రి ఇద్దరు మహిళలు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంకు చెందిన శెట్టి మౌనిక (32) బతుకమ్మ ఆడేందుకు ఇద్దరు కూతుళ్లు, కుమారునితో కలిసి గ్రామంలోని గుడి వద్దకు వెళ్లింది. బతుకమ్మ చుట్టూ చేరి ఆటలు ఆడుతున్న సమయంలోనే మౌనిక ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మౌనికను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంగలి మేఘన(24) సైతం బతుకమ్మ ఆడుతుండగా ఆకస్మాత్తుగా ఛాతిలో నొప్పి వచ్చి పడిపోయింది. వెంటనే అక్కడున్న మహిళలు జహీరాబాద్‌లోని ప్రభ్వుత ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు.

# 1300 చెరువులకు హద్దులు ఫైనల్



హైదరాబాద్ సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): హెచ్‌ఎండీఏ పరిధిలో 1300 చెరువులకు హద్దులను ఖరారు చేస్తూ ఫైనల్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. చెరువుల హద్దుల అంశాన్ని హైకోర్టు సుమోటోగా తీసుకున్న నేపథ్యంలో హెచ్‌ఎండీఏతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, స్థానిక సంస్థల అధికారులు కసరత్తు చేస్తున్నారు. హెచ్‌ఎండీఏ ఇప్పటి వరకు 2949 చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేస్తూ ప్రిలిమినరీ నోటిఫికేషన్లు వేసింది. ఆయా చెరువులకు ఐడీ నంబర్లను కూడా ఇచ్చింది. ఆయా చెరువులకు ప్రజల నుంచి అభ్యంతరాలన్నీ స్వీకరించి 1300 చెరువులకు హద్దులను ఖరారు చేస్తూ ఫైనల్ నోటిఫికేషన్ వేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 500 చెరువులకు హద్దులను ఖరారు చేశారు. హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ఈ ఏడాది నెల రోజుల వ్యవధిలోనే 197 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్లను జారీ చేసింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాలో సంగారెడ్డి జిల్లాలోనే నెల రోజుల్లో అత్యధికంగా 92 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ చేశారు. మెదక్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాలు కొంత మేరకు కృషి చేయగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో నెల రోజుల వ్యవధిలో ఒక్క చెరువుకు ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఔటర్ వరకు ఉన్న చెరువుల పూర్తి నీటి నిల్వ సామర్థ్యం(ఎఫ్‌టీఎల్), బఫర్‌జోన్ నిర్ధారణకు తుది నోటిఫికేషన్‌ను వచ్చే నేల నుంచి ప్రకటించనున్నట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కూడా గుర్తించనున్నట్టు చెప్పారు.

# హుస్సేన్ సాగర్‌కు పోటెత్తిన వరద..

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన..




హైదరాబాద్: సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో హుస్సేన్ సాగర్ జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రమాదకర స్థాయిలో హుస్సేన్ సాగర్‌కు వరద ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాలాల ద్వారా భారీగా హుస్సేన్ సాగర్లోకి వరద వచ్చి చేరుతున్నట్లు పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లుగా ప్రస్తుత నీటిమట్టం 513.63 మీటర్లుగా ఉన్నట్లు చెప్పారు. ఇన్ ఫ్లో 1530 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 1525 క్యూసెక్కులుగా ఉన్నట్లు వివరించారు. కూకట్ పల్లి, బంజారా, పికెట్, బుల్కాపూర్ నాలాల నుంచి హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరద ఉద్ధృతి కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.సిటీలోని పలు ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు హుస్సేన్ సాగర్‌కి వచ్చి చేరుతోందని అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తూముల ద్వారా మూసీలోకి వరద నీటిని వదులుతున్నట్లు పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ హెచ్చరికలు జారీ చేసింది. దిగువన నల్గొండలో మూసీ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. కాగా, అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# చివరి ఆయకట్టుకు చుక్కనీరు రాలే



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్):కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కింద క్రమంగా పెరుగుతున్న ఆయకట్టుకు నీరందిం చే క్రమంలో సాగునీటి శాఖకు అనేక అవాంత రాలు ఎదురవుతున్నాయి. కేఎల్ఐ హెడ్‌వర్క్స్ లో రెండు మోటార్లు మరమ్మతుకు నోచుకోకపో వడం, కాల్వల సామర్థ్యం పెరిగినా ఆయకట్టు కనుగుణంగా పెంచకపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది. కేఎల్ఐ కింద ఎల్లూరు, సింగ వట్నం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వా యర్లు మినహాయించి చెరువులు, కుంటల్లో నీళ్లు నింపడం తప్ప అదనంగా నిర్మించాల్సిన 17 రిజర్వాయర్ల ఊసే ఎత్తలేదు. దీంతో కేఎల్ ఐపై ఆశలు పెట్టుకున్న చివరి ఆయకట్టు రైతు ల్లో నిరాశ వ్యక్తమవుతోంది.కేఎల్ఐ కింద 2.45లక్షల ఎకరాల మెట్ట పం టలకు సాగునీరందించాలనే లక్ష్యంతో పనుల ను ప్రారంభించారు. ఈ క్రమంలో రైతుల నుం చి వచ్చిన అభ్యర్థనల మేరకు ఆయకట్టు పరి మాణం పెరుగుతూ దాదాపు 4.45లక్షల ఎకరా లకు చేరింది. 2.45లక్షల ఎకరాల ఆయ కట్టుకు సాగునీరందించాలనే లక్ష్యంతో కేఎల్ఐ డిజైన్ రూపొందించారు. గుడిపల్లి గట్టు నుంచి 160 కిలోమీటర్ల వరకు మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరందించాల్సిన మెయిన్ కెనాల్‌లో అసలు ఆయకట్టు 1.80లక్షల ఎకరాలు కాగా.. డీ-82 వరకు అదనంగా 37,742ఎకరాలకు పెం చారు. బుద్దారం కెనాల్ ఆయకట్టు విస్తీర్ణాన్ని 20,724 ఎకరాలకు పెంచగా కేఎల్ఐ మెయిన్ కెనాల్‌లో 37వ కిలో మీటరు వద్ద ఘణపూర్ బ్రాంచ్ కెనాల్ పేరిట మరో 25వేల ఎకరాల ఆయకట్టును జోడించారు. కర్నెతండాలో 4,400 ఎకరాలు, మార్కండేయ రిజర్వాయర్ పేరిట 7,310 ఎకరాల్లో కేఎల్ఐ ఆయకట్టు కింద విస్తీ ర్ణాన్ని రైతుల డిమాండ్ దృష్ట్యా పెంచాల్సి వ చ్చింది. కల్వకుర్తి కెనాల్ కింద రంగారెడ్డి జిల్లా లోని మాడ్గుల, ఆమనగల్ మండలాల్లో దాదా పు 21వేల ఎకరాలకు కృష్ణా జలాలతో మెట్ట భూములను తడపాల్సి ఉండగా కనీసం వెయ్యి ఎకరాలకు కూడా నీరందించలేని పరిస్థితి తలెత్తింది. డీ-82 కెనాల్ తరచూ తెగిపోతుండ దంతో చివరి ఆయకట్టుకు చుక్క నీరందించలే ని పరిస్థితి తలెత్తింది. అచ్చంపేట బ్రాంచ్ కెనా ల్ పరిస్థితి కూడా అలాగే ఉంది. 90వేల ఎకరా ల ఆయకట్టుకు సాగునీరందించాల్సి ఉం డగా 15వేల ఎకరాల ఆయకట్టును పెంచడంతో క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

# ఉచిత హెపటైటీస్ వ్యాక్సినేషన్ ప్రారంభం



సుభాష్‌నగర్, సెప్టెంబర్ 23 (సందేశం టైమ్స్): నేషనల్ వైరల్ హెపటైటీస్ కంట్రోల్ ప్రోగ్రాం కింద ఉచిత హెపటైటీస్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా జనరల్ ఆసుపత్రిలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ తకీయుద్దీన్, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదాఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ నవీన, హెల్త్ ఎడ్యుకేటర్ సరస్వతి, ఇతర వైద్యాధికారులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# క్రీడావార్తలు



# పాక్ పిచ్చి చేష్టలు ఫర్హాన్, రౌఫ్‌ల వివాదాస్పద తీరు

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్–పాకిస్థాన్ జట్ల మధ్య దశాబ్దాలుగా ఎన్నో మ్యాచ్‌లను చూసుంటాం. కానీ ఆసియాకప్ సూపర్–4లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మాత్రం దాయాది క్రికెటర్ల ప్రవర్తన అందరినీ షాక్‌కు గురి చేసింది. గ్రూప్ మ్యాచ్‌లో ఆ జట్టు ఆటగాళ్లతో షేక్‌హ్యాండ్‌కు నిరాకరించినందుకే క్రీడల్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదని పాక్ బోర్డు పెద్దలు, మాజీలు భారత్‌కు ఉపదేశాలిచ్చారు. కానీ దానికి వంద రెట్లు మించినట్టుగా పాక్ ఓపెనర్ ఫర్హాన్, పేసర్ హారీస్ రౌఫ్‌ల చేష్టలున్నాయి. అర్ధసెంచరీ అయ్యాక ఫర్హాన్ బ్యాట్‌ను గన్‌గా మార్చి బుల్లెట్లు పేల్చుతున్నట్టుగా పహల్గామ్ దాడిని గుర్తు చేస్తూ సంబరాలు చేసుకున్నాడు. ఇక బౌండరీ లైన్ దగ్గర రౌఫ్ భారత అభిమానులను మరింత కవ్వించేలా ప్రవర్తించాడు. ఆపరేషన్ సింధూర్‌లో భారత్‌కు చెందిన ఆరు రఫేల్ విమానాలను కూల్చేశామని అప్పట్లో పాక్ ప్రగల్భాలు పలికింది. దాన్ని ఉదహరిస్తూ.. అతను ప్రేక్షకులకు ఆరు వేళ్లను చూపించాడు. అంతేకాకుండా విమానం కింద పడుతున్నట్టుగా చేతులతో సైగ చేయడం కనిపించింది. అటు రౌఫ్ భార్య ఇవే ఫొటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేసి 'మ్యాచ్ ఓడినా, యుద్ధంలో గెలిచాం' అంటూ భర్తకు వంత పాడింది. ఇక ఫర్హాన్ తన ఫైరింగ్ సంబరాలను నిస్సిగ్గుగా సమర్థించుకున్నాడు. 'గతంలో నేనెప్పుడూ సంబరాలు చేసుకోలేదు. కానీ ఈసారి ఎందుకో




చేసుకోవాలనిపించింది. ఎవరేమనుకున్నా నేను లెక్కచేయను' అని తెగేసి చెప్పాడు. వాస్తవానికి గతంలో పాక్ క్రికెటర్ల నుంచి ఇలాంటి మిలిటెంట్ మనస్థత్వాన్ని ఎన్నడూ చూడలేదు. మైదానంలో మాటా మాటా అనుకోవడం వరకే పరిమితమయ్యేది. భారత మీడియాను ఎదుర్కొనేందుకు పాక్ క్రికెట్ జట్టు వెనుకంజ వేస్తోంది. గ్రూప్ మ్యాచ్‌లో ఓడాక.. అలాగే యూఏఈతో మ్యాచ్ ముగిశాక కూడా విలేకరుల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు భయపడి పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా మీడియా ముందుకు రాలేదు. ఇప్పుడు రెండో ఓటమి తర్వాత మాత్రం ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చాడు. కానీ కేవలం పాకిస్తాన్ మీడియాకు తప్ప, భారత విలేకరులను ప్రశ్నలను అడిగేందుకు అనుమతించకపోవడం గమనార్హం. భారత్‌తో మ్యాచ్‌లో పాక్ క్రికెటర్ల హింసాత్మక ప్రవృత్తిని ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తప్పుపట్టాడు. 'ఓపెనర్ ఫర్హాన్ ఏకే 47ను పేల్చినట్టుగా సంజ్ఞ చేశాడు. కానీ అభిషేక్, గిల్ వారిపై ఏకంగా బ్రహ్మోస్ క్షిపణినే పేల్చారు. పాక్ చర్యకు భారత్ ప్రతిచర్య భారీ స్థాయిలో ఉంది. ఇక ఇప్పుడు పాక్ జట్టు ఫఖర్ జమాన్ క్యాచ్‌ను వివాదంగా మార్చేందుకు ప్రయత్నిస్తుంది' అని కనేరియా అన్నాడు. పాక్ బౌలర్లను తొలి బంతి నుంచే ఊచకోత కోసిన భారత ఓపెనర్ అభిషేక్ శర్మ జట్టు విజయంలో కీలకమయ్యాడు. అయితే అకారణంగా పాక్ ప్లేయర్లు తమ మీదికి రావడం నచ్చలేదన్నాడు. మ్యాచ్‌లో పేసర్లు షహీన్, రౌఫ్‌లతో అతడికి వాగ్వాదం జరిగిన విషయం తెలిసిందే . 'వారు ఎలాంటి కారణం లేకుండా మాతో అలా ప్రవర్తించారు. నాకిలాంటివి నచ్చవు. అందుకే ప్రతీ బంతిని బాది వారికి సరైన మెడిసిన్ ఇవ్వాలనుకున్నా' అని అభిషేక్ తెలిపాడు. సరైన ప్రత్యర్థి అంటే మైదానంలో నువ్వా.. నేనా? అనే రీతిలో తలపడాల్సి ఉంటుందని, కానీ పాక్ జట్టుతో తమకు పోటీ ఎక్కడుందని భారత కెప్టెన్ సూర్యకుమార్ ప్రశ్నించాడు. 'ఇక నుంచి పాక్ జట్టును మాకు ప్రత్యర్థి అని అనకండి. ఏదేనీ రెండు జట్లు 15 మ్యాచ్‌ల్లో తలపడి 8–7తో ఉంటే అప్పుడు ఓకే. కానీ ఇక్కడ 12–3తో మేం స్పష్టమైన ఆధిక్యంలో ఉన్నాం. ఇక పోటీ ఏముంది?' అని పాక్ విలేకరి అడిగిన ప్రశ్నకు సూర్య సూటిగా జవాబిచ్చాడు.

# అలా అయితేనే పాకిస్థాన్ జట్టు గెలవగలదు..

## ఇమ్రాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు..




ఆసియా కప్‌లో వరుసగా రెండు సార్లు టీమిండియా చేతిలో ఓడిపోయిన పాకిస్థాన్ జట్టుపై ఇంటా బయటా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి ఆ జట్టు అభిమానులు, మాజీ ఆటగాళ్లు కోపంతో మండిపోతున్నారు. పాక్ ఓటములపై పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ కూడా స్పందించారు. పాకిస్థాన్ గెలవాలంటే ఏం చేయాలో చెబుతూ వ్యంగ్యంగా కామెంట్స్ చేశారు. ఈ విషయాన్ని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్ సోమవారం వెల్లడించారు. 'ఆసియా కప్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ వరుసగా రెండు సార్లు ఓడిపోవడం గురించి నా సోదరుడికి చెప్పాను. భారత్‌పై పాకిస్థాన్ గెలవాలంటే.. పీసీబీ ఛైర్మన్ నఖ్వీ, ఆర్మీ ఛీఫ్ ఆసిఫ్ మునీర్ ఓపెనర్లుగా బరిలోకి దిగి, అంపైర్లనందరినీ మనవాళ్లను పెట్టుకోవాలని ఇమ్రాన్ అన్నారు. అసమర్థత, బంధుప్రీతితో పాకిస్థాన్ క్రికెట్‌ను నఖ్వీ నాశనం చేశాడని ఇమ్రాన్ బాధపడ్డారు. పాక్ ఆడుతున్న తీరు చూస్తే చాలా అవమానకరంగా ఉంది' అని అలీమా ఖాన్ సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు పాకిస్థాన్ ప్రధానిగా ఉన్న సమయంలో ఇమ్రాన్ ఖాన్ అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం జైలులో ఉన్నారు023 ఆగస్ట్ నెలలో ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి జైలులో ఉంటున్న ఇమ్రాన్ ఖాన్ బెయిల్ కోసం ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశారు. అయితే ఆయన చేసిన ప్రయత్నాలు మాత్రం సఫలం కాలేదు.

# అభిషేక్ విజయం వెనుక యువరాజ్‌ది కీలక పాత్ర..

## అభిషేక్ తండ్రి ప్రశంసలు..




%ఆసియా కప్‌లో భాగంగా ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఏడు వికెట్ల తేడాతో పాక్‌ను మట్టికరిపించింది. ఈ విజయంలో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కీలక పాత్ర పోషించాడు. 39 బంతుల్లో ఐదు సిక్సర్లు, ఆరు ఫోర్లతో 74 పరుగులు చేసి పాక్ బౌలర్లను బెంబేలెత్తించాడు. అతని విధ్వంసక ఇన్నింగ్స్ లక్ష్యాన్ని సులభంగా ఛేదించేందుకు దోహదపడింది. అభిషేక్‌పై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అతడి తండ్రి రాజ్‌కుమార్ శర్మ స్పందించారు. 'అభిషేక్‌కు సహజసిద్ధంగానే టైమింగ్, పవర్ ఉంది. వాటికి కావాల్సిన డైరెక్షన్‌ను యువరాజ్ సింగ్ అందించాడు. అభిషేక్‌కు యువరాజ్ గురువు. తన అనుభవాలను అభిషేక్‌తో పంచుకునేవాడు. పరిస్థితులకు తగ్గట్టు ఆటతీరును మార్చుకోవాలనే సూత్రాన్ని తరచుగా చెబుతుండేవాడు. వ్యక్తిగత లక్ష్యాల కోసం కాకుండా, జట్టు కోసం ఆడాలని సూచించేవాడు. యువీ మార్గదర్శకత్వంలోనే అభిషేక్ ఉత్తమ క్రికెటర్‌గా ఎదిగాడు' అని రాజ్‌కుమార్ శర్మ పేర్కొన్నారు %అలాగే శుభ్‌మన్ గిల్‌తో అభిషేక్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారిద్దరి మధ్య సోదరభావం ఉందని రాజ్‌కుమార్ శర్మ తెలిపారు వారిద్దరూ పదేళ్ల వయసు నుంచి కలిసి ఆడుతున్నారని, ఒకరి బలాబలాల గురించి మరొకరికి తెలుసని అన్నారు. చిన్నవయసులో వారిద్దరూ కలిసి ప్రాక్టీస్ చేసే వారని, దేశం కోసం మ్యాచ్‌లు ఎలా గెలవాలో వారికి తెలుసని పేర్కొన్నారు. వారిద్దరూ ఇలాంటి ఎన్నో ఉత్తమ ఇన్నింగ్స్‌లు ఆడాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

# నాయర్ నితీశ్‌లకు చాన్స్ దక్కేనా

న్యూఢిల్లీ: ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీసకు ఎంపికైన కరుణ్ నాయర్‌కు మరో అవకాశం ఇస్తారా? లేదా? అనేది సస్పెన్స్‌గా మారింది. స్వదేశంలో వెస్టిండీసతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం భారత జట్టును సెలెక్షన్ కమిటీ బుధవారం ఎంపిక చేయనుంది. ప్రస్తుతం సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ దుబాయ్‌లో ఉండడంతో.. వర్చువల్‌గా ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారని సమాచారం. గాయం నుంచి కోలుకొన్న కరుణ్ నాయర్ సెలెక్షన్‌కు అందుబాటులో ఉన్నాడు. అయితే, ఇంగ్లండ్ టూర్‌లో కరుణ్ చెప్పుకోదగ్గ రీతిలో ఆడలేక పోయాడు. దీంతో అతడి స్థానానికి తెలుగు ఆటగాడు నితీష్ కుమార్, దేవ్‌దత్ పడిక్కళ్ నుంచి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గాయం నుంచి కోలుకొన్న నితీశ్.. ఆస్ట్రేలియా–ఎ టూర్‌కు ఎంపికయ్యాడు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి



సుదర్శన్ స్థానాలు పదిలంగానే కనిపిస్తున్నాయి. ఇంగ్లండ్ టూర్‌లో గాయపడిన రిషభ్ పంత్ విషయంలో మెడికల్ టీమ్ నివేదిక అందాల్సి ఉంది. అయితే అతను ఫిట్‌గా లేడని, ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్‌గా తీసుకోవడం ఖాయమని అంటున్నారు. రెండో వికెట్ కీపర్, మూడో ఓపెనర్‌గా నారాయణ్ జగదీశన్‌కు చాన్సిస్తే.. అభిమన్యు ఈశ్వరన్‌కు చోటు కష్టమే. ఫిట్‌నెస్ ఇబ్బందులేమీ లేకపోతే జడేజా, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌తోపాటు సిరాజ్‌కు చోటు ఖాయమే. తుదిజట్టులో నితీశ్‌కు చాన్సిస్తే.. ప్రసిద్ధ్ కృష్ణ లేదా అక్షర్ పటేల్‌లో ఒకరికి నిరాశ తప్పదు. శ్రేయాస్ అయ్యర్‌కు చోటు కష్టమేనంటున్నారు. వచ్చే నెల రెండు నుంచి అహ్మదాబాద్‌లో విండీసతో తొలి టెస్ట్ జరగనుంది. ప్రాబబుల్స్ (15): శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, కరుణ్ నాయర్/పడిక్కళ్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), జడేజా, సుందర్, కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్, అక్షర్, నారాయణ్ జగదీశన్, నితీశ్ కుమార్, ఆకాష్ దీప్.

# మళ్లీ అదే జోష్, రెచ్చగొట్టిన పాక్ ఆటగాళ్లు..గెలిచి చూపించిన భారత్




%ఇండియా %జం% పాకిస్తాన్ మ్యాచ్ అంటే చాలు. అది క్రికెట్ సహా ఏ క్రీడ అయినా కూడా జనాల్లో ఆసక్తి ఉంటుంది. ఫుట్‌బాల్ కావచ్చు, పింగ్ పాంగ్ అయినా సరే రెండు దేశాల మధ్య మ్యాచ్ అంటే రసవత్తరంగా మారుతుంది. ఇటీవల జరిగిన ఆసియా కప్ 2025లో కూడా అదే తీరు కనిపించింది. ఇప్పుడు తాజాగా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో కూడా భారత్–పాక్ మ్యాచ్ వివాదాస్పదంగా మారింది. కొలంబోలోని రేస్‌కోర్స్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో భారత్ 3–2 స్కోరుతో పాకిస్తాన్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్ రెండు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన తర్వాత జరిగినప్పటికీ, ఆటలో మాత్రం ఉత్కంఠ తగ్గలేదు. మ్యాచ్‌లో భారత్ తరఫున డల్లల్‌మున్ గంగ్టే 31వ నిమిషంలో గోల్ కొట్టి ఆధిక్యం సాధించాడు. దానికి సమాధానంగా, పాకిస్తాన్ ఆటగాడు ముహమ్మద్ అబ్దుల్లా 43వ నిమిషంలో పెనాల్టీ ద్వారా గోల్ చేసి స్కోరును సమం చేశాడు. అదే సమయంలో అబ్దుల్లా గోల్ సెలబ్రేషన్ వివాదానికి కారణమైంది. అతను కార్నర్‌కు వెళ్లి, తన సహచరులతో కలిసి కూర్చుని టీ తాగుతున్నట్టు సెలబ్రేట్ చేసుకున్నాడు. ఈ సెలబ్రేషన్ అందరి దృష్టిని ఆకర్షించింది. భారత ఆటగాళ్లు దీన్ని సీరియస్‌గా తీసుకుని, మరింత ఉత్సాహంతో ఆడారు. డానీ సింగ్ వాంగ్‌ఖెమ్ వింగ్‌లో దూసుకెళ్లి, పాక్ డిఫెండర్‌ను దాటి కచ్చితమైన పాస్ ఇచ్చాడు. ఆ బంతిని గంగ్టే అద్భుతంగా గోల్‌గా మలిచి, భారత్‌కు మళ్లీ ఆధిక్యాన్ని అందించాడు. దీంతో భారత్ 3–2 స్కోరుతో విజయం సాధించి, పాకిస్తాన్‌కు చుక్కలు చూపించింది. దీనికి ముందు ఆసియా కప్ 2025లో భారత్–పాకిస్తాన్ మధ్య గ్రూప్ స్టేజ్, ఆదివారం దుబాయ్‌లో జరిగిన సూపర్ ఫోర్ మ్యాచ్‌లు కూడా ఉత్కంఠ రేపాయి. పాకిస్తాన్ క్రికెటర్లు హారిస్ రౌఫ్, సాహిబ్‌జాదా ఆటలో భాగంగా రెచ్చగొట్టే సంజ్ఞలు చేయడం, ఆ తర్వాత భారత ఆటగాళ్ల విజృంభించి ఆడటం కనిపించింది.

# బిజినెస్



## జీవితకాల కనిష్టానికి రూపాయి..
## డాలర్‌తో పోల్చితే రూపాయి విలువెంత..




రూపాయి విలువ రోజు రోజుకూ క్షీణిస్తోంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ రికార్డు కనిష్ట స్థాయిని తాకింది. మునుపటి సెషన్‌లో 88.32 వద్ద స్థిరపడిన రూపాయి విలువ మంగళవారం మరింత దిగజారింది. చరిత్రలో తొలిసారి 88.50ని దాటింది. ఈ రోజు రూపాయి ట్రేడింగ్ పరిధి 88.15 - 88.50 మధ్యలో ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు (%×చీ= జం ఖాణ 88.50).భారతీయ వస్తువులపై అమెరికా సుంకాలు పెరగడం, హెచ్1బీ వీసాలపై రుసుము లక్ష డాలర్లకు చేరడం వంటి ప్రతికూల పరిస్థితుల కారణంగా రూపాయి ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది . ఇక, సోమవారం దేశీయ మార్కెట్‌లో ఎఫ్‌పీఐలు, రూ. 2,900 కోట్ల షేర్లను విక్రయించడం కూడా నెగిటివ్‌గా మారింది.కాగా, సెప్టెంబర్ ప్రారంభంలో రూపాయి యూఎస్ డాలర్‌తో పోలిస్తే 88.44 వద్ద ముగిసింది ఇది అప్పటికి ఆల్ టైమ్ కనిష్టం. ఆ తర్వాత కాస్త కోలుకున్న రూపాయి ఈ రోజు 88.50 వద్దకు చేరుకుని సరికొత్త రికార్డును నమోదు చేసింది.

## నష్టాలతో మొదలైన సూచీలు..
## ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..




సోమవారం భారీ నష్టాలను చవిచూసిన సూచీలు మంగళవారం కూడా అదే ధోరణిలో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ ఐటీ రంగంలో అమ్మకాలు సూచీలు వెనక్కి లాగుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పడిపోవడం కూడా స్టాక్ మార్కెట్‌కు నెగిటివ్‌గా మారింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలను ఎదుర్కొంటున్నాయి సోమవారం ముగింపు (82, 159)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండడంతో లాభనష్టాలతో దోబూచులాడుతోంది. ప్రస్తుతం ఉదయం 10:10 గంటల సమయంలో సెన్సెక్స్ 135 పాయింట్ల నష్టంతో 82, 024 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 44 పాయింట్ల నష్టంతో 25, 157 వద్ద కొనసాగుతోంది %సెన్సెక్స్‌లో అశోక్ లేలాండ్, మారుతీ సుజుకీ, వోడాఫోన్ ఐడియా, ఎమ్ అండ్ ఎమ్, టీవీఎస్ మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఎంఫసిస్, ట్రెంట్, అదానీ ఎనర్జీ, ఆసియన్ పెయింట్స్, నవుమా వెల్త్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 207 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 39 పాయింట్ల లాభంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 88.56గా ఉంది.

## బంగారం ధర మరింత ముందుకు..
## ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (సెప్టెంబర్ 23న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 13, 080కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 03, 660కి చేరింది ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 13, 230కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 03, 810కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 13, 080కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 03, 660కి చేరింది వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే కేజీకి వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం

## ఆర్బీఐ రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చు..ఎస్బీఐ రీసెర్చ్




ఈ ఏడాది సామాన్యులకు కేంద్ర ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలిసి ఊరట కలిగించే నిర్ణయాలు ప్రకటించాయి. 12 లక్షల రూపాయల వార్షిక ఆదాయంపై ఇన్‌కమ్ ట్యాక్స్ రిబేట్, రోజువారీ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు..రెపో రేటు తగ్గించడంతో ఈఎంఐలు తక్కువ అయ్యాయి. ఇప్పుడు ఆర్బీఐ రేట్ ప్యానెల్ మానిటరీ పాలసీ కమిటీ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 1 వరకు మరోసారి సమావేశం కానుంది. ఈ సమావేశంలో రెపో రేటును మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తారా అనే చర్చ జోరుగా సాగుతోంది.

ఇప్పటివరకు ఏం జరిగింది?

ఈ రేట్ కట్ సైకిల్‌లో ఆర్బీఐ ఇప్పటికే మూడు సార్లు రెపో రేటును తగ్గించింది. ఫిబ్రవరి, ఏప్రిల్లో 25 బీపీఎస్ చొప్పున, జూన్‌లో 50 బీపీఎస్ తగ్గించింది. కానీ ఆగస్టు 2025లో జరిగిన పాలసీలో రెపో రేటును 5.5% వద్ద మార్పు లేకుండా ఉంచారు. న్యూట్రల్ స్టాన్స్‌తో ఉంచగా, ఇప్పుడు సెప్టెంబర్ 2025 పాలసీలో ఆర్బీఐ మరో 25 బీపీఎస్ తగ్గించవచ్చని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%వాదీ×%) రీసెర్చ్ రిపోర్ట్ అంచనా వేస్తోంది.

రేట్ కట్‌లకు

ఎస్బీఐ రిపోర్ట్ ఏం చెప్తోందంటే సెంట్రల్ బ్యాంక్ కమ్యూనికేషన్ అనేది ఒక పాలసీ టూల్ లాంటిది. సెప్టెంబర్‌లో కూడా రెపో రేటు తగ్గించకపోతే అది ఒక రకమైన తప్పిదం (టైప్ 2 ఎర్రర్) అవుతుంది. అందుకే 25 బీపీఎస్ తగ్గింపు ఈ సమయంలో మంచి నిర్ణయమని తెలిపింది. జూన్ తర్వాత రేట్ కట్‌లకు అవసరమైన ప్రమాణాలు కొంచెం కఠినంగా మారాయని, అందుకే ఆర్బీఐ ఈ నిర్ణయాన్ని చాలా జాగ్రత్తగా కమ్యూనికేట్ చేయాలని రిపోర్ట్ సూచిస్తోంది. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటంతో రెపో రేటు తగ్గించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ద్రవ్యోల్బణం ఎలా ఉంది?

ఎస్బీఐ రిపోర్ట్ ప్రకారం ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్) 2027 ఆర్థిక సంవత్సరంలో కూడా నియంత్రణలో ఉంటుందని అంచనా. జీఎస్టీ తగ్గింపు లేకపోయినా, సెప్టెంబర్, అక్టోబర్‌లలో ద్రవ్యోల్బణం 2% కంటే తక్కువగా ఉంది. 2027 ఆర్థిక సంవత్సరంలో సీపీఐ (కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్) ద్రవ్యోల్బణం సగటున 4% లేదా అంతకంటే తక్కువగా ఉంటుందని అంచనా. జీఎస్టీ రేట్ల రీస్ట్రక్చరింగ్‌తో అక్టోబర్ సీపీఐ 1.1%కి పడిపోవచ్చు. ఇది 2004 తర్వాత అతి తక్కువ స్థాయి అవుతుంది.

## గ్లాస్ ట్యూబింగ్ ప్లాంట్




ఫార్మా రంగానికి చెందిన కార్నింగ్, ఫ్రెంచ్ కంపెనీ ఎస్‌జీడీ ఫార్మా జాయింట్ వెంచర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వేముల వద్ద అత్యాధునికమైన గ్లాస్ ట్యూబింగ్ ప్లాంట్‌ను ప్రారంభించాయి. ఈ ప్లాంట్ ఏర్పాటుకు రూ.500 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. సోమవారం లాంఛనప్రాయంగా ప్రారంభించిన ఈ ప్లాంట్‌ను కార్నింగ్‌కు చెందిన అత్యాధునిక వయల్ టెక్నాలజీని, ఎస్‌జీడీ ఫార్మాకు గల వయల్ కన్వర్టింగ్ అనుభవాన్ని జోడించి ఏర్పాటు చేశారు. ఈ కొత్త ప్లాంట్ అత్యున్నత నాణ్యత గల టైప్ 1 బోరోసిలికేట్ గ్లాస్ ట్యూబింగ్‌ను తయారుచేస్తుంది. ఇంజెక్షన్ల ప్యాకేజింగ్‌లో ఉపయోగించే కీలక ఉపకరణం ఈ గ్లాస్ ట్యూబింగ్. అత్యంత కీలకమైన ప్రాంతీయ అవసరాలు తీర్చడంలో కీలక మైలురాయి ఈ ప్లాంట్ ప్రారంభమని కార్నింగ్ లైఫ్ సైన్సెస్ వైస్ ప్రెసిడెంట్, జీఎం క్రిస్ హడ్సన్ అన్నారు. ఉత్పత్తి సామర్థ్య విస్తరణకు, కస్టమర్లకు చేరువగా ఉండేందుకు, సరఫరా వ్యవస్థల స్థానికీకరణకు ఈ ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఇంజెక్షన్ల డెలివరీ, స్థానిక ఫార్మా రంగ వృద్ధిలో ఈ ప్లాంట్ క్రియాశీల పాత్ర పోషిస్తుంది.కార్నింగ్‌తో ఈ జేవీ తమ ప్రపంచ వృద్ధి వ్యూహంలో ఒక కీలక మైలురాయి అని ఎస్‌జీడీ ఫార్మా సీఈఓ ఆలివర్ రోసావు అన్నారు. తెలంగాణలో అత్యాధునిక ప్లాంట్ ఏర్పాటు వల్ల తమ సరఫరా వ్యవస్థ సుస్థిరతతో పాటు అమిత వేగంగా వృద్ధి చెందుతున్న ఫార్మా మార్కెట్లలో ఒకటైన తెలంగాణకు అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చినట్టవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్ ద్వారా 150 ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడడంతో పాటు పరోక్షంగా వందలాది ఉద్యోగాలు స్థానికులకు అందుబాటులోకి వస్తాయని కార్నింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుధీర్ పిళ్లై అన్నారు.

## కార్ల షోరూమ్‌లు కళకళ

న్యూఢిల్లీ: వాహనాలపై జీఎసటీ తగ్గింపు సోమవారం నుంచి అమలులోకి రావడంతో కార్ల షోరూమ్‌లు కొత్త కళను సంతరించుకున్నాయి. నవరాత్రుల తొలిరోజున తమ కార్ల రిటైల్ విక్రయాలు 25,000–30,000 మించవచ్చని దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) తెలిపింది. కస్టమర్ల తాకిడితో షోరూమ్‌లు అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచాల్సి వచ్చిందని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్కెటింగ్ అండ్ సేల్స్ పార్థో బెనర్జీ తెలిపారు. కంపెనీ డీలర్‌షిపలకు ఒక్కరోజే 80,000 కస్టమర్ల ఎంక్వైరీలు వచ్చాయన్నారు. జీఎసటీ తగ్గుదలతో చిన్న కార్ల బుకింగ్స్ 50 శాతం పెరిగాయన్నారు. కొన్ని మోడళ్ల వేరియంట్లకు అధిక గిరాకీ నెలకొనడంతో నిల్వలు నిండుకోవచ్చన్నారు. విక్రయాలపరంగా కంపెనీకిదే అత్యుత్తమ రోజని బెనర్జీ పేర్కొన్నారు.నవరాత్రుల ఆరంభానికి జీఎసటీ తగ్గుదల తోడవడంతో మార్కెట్ సెంటిమెంట్ అత్యంత సానుకూలంగా మారిందని హ్యుండయ్ మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ అన్నారు. జీఎసటీ తగ్గిన తొలి రోజే తమ డీలర్లు 11,000 కార్లను విక్రయించారని, గడిచిన ఐదేళ్లలో కంపెనీకిదే అత్యధిక ఒక్కరోజు అమ్మకాలని ఆయన తెలిపారు. కొత్త కార్ల కొనుగోలు కోసం షోరూమ్‌లకు కస్టమర్ల తాకిడి భారీగా పెరిగిందని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) అధ్యక్షులు సీఎన్ విఘ్నేశ్వర్ తెలిపారు."గడిచిన 3–4 వారాలుగా కస్టమర్ల ఎంక్వైరీలు అనూహ్యంగా పెరిగాయి. దుర్గ నవరాత్రుల తొలి రోజుల విక్రయాలు భారీగా పుంజుకోనున్నాయని" ఆయన పేర్కొన్నారు.యూజ్డ్ కార్ల విక్రయాలూ అనూహ్యంగా పెరిగాయని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ 'కార్స్24' తెలిపింది. రోజువారీ సగటుతో పోలిస్తే, సోమవారం మధ్యాహ్నం 2 గంటల వరకు కార్ల డెలివరీలు ఏకంగా 400 శాతం పెరిగాయని తెలిపింది. ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో అధిక విక్రయాలు నమోదయ్యాయని.. అహ్మదాబాద్, బెంగళూరు, పుణె, ముంబై ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయంది.




అలాగే, తమ ప్లాట్‌ఫామ్ ద్వారా కారును విక్రయించాలనుకునే సంఖ్య కూడా భారీగా పెరిగిందని కార్స్24 వెల్లడించింది. ఒక్కరోజులో 5,000 వాహనాల తనిఖీలు జరిపామని, గడిచిన నాలుగేళ్లలో ఇదే అత్యధికమని పేర్కొంది.జీఎసటీ తగ్గింపుతో నవరాత్రుల తొలిరోజున ఎయిర్ కండీషనర్లు (ఏసీ), టెలివిజన్ (టీవీ) అమ్మకాలు కూడా భారీగా పెరిగాయి. విక్రేతల చౌక డీల్స్‌ను అందిపుచ్చుకునేందుకు కొనుగోలుదారులు ఎగబడ్డారు. ఇతర సోమవారాలతో పోలిస్తే, 22న రెట్టింపు విక్రయాలు జరిపినట్లు హాయర్ ఇండియా ప్రెసిడెంట్ ఎన్ఎస సతీశ్ తెలిపారు. జీఎసటీ తగ్గింపునకు ముందే ఈ కంపెనీ ప్రీ–బుకింగ్‌ను ప్రారంభించింది.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006